అక్రమ నిర్మాణం.. నేలమట్టం

● గండిపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ● మిగతా చోట్ల తొలగించాలని డిమాండ్


గండిపేటలో నేలమట్టమైన షాపులు


షాపులను కూల్చుతున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ: కోకాపేట చౌరస్తా నుంచి గండిపేట సాయిబాబ గుడి వరకు వంద అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు గతంలో రూ. 15 కోట్లతో పనులు చేపట్టారు. ఆ పనులు కాస్త గండిపేట గ్రామ ప్రవేశం వరకు చేసిన పక్కన పెట్టడంతో ఇష్టారాజ్యంగా రోడ్డు ఆక్రమణలు జరుగుతున్నాయి. ఓ విల్లా ప్రాజెక్టు వారు సర్వే నెంబర్ 60,61లో హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తెచ్చుకుని పూర్తి చేసుకున్నారు. రోడ్డు వెడల్పుకంటూ ప్రభుత్వానికి స్వాధీనం చేసిన రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఏకంగా 28 షాపుల నిర్మాణానికి తెరలేపారు. స్థానికంగా ప్రజా ప్రతినిధులను మచ్చిక చేసుకుని పనులు పూర్తి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి నిబంధలను విరుద్ధంగా వంద అడుగుల రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుపుకుంటున్న షాపులను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో శనివారం టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీలతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా మణిహారిక మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులను జారీ చేశామని, వాటిని రాబోయే రోజుల్లో విడతల వారీగా కూల్చివేస్తామన్నారు.నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేసుకుని నిశ్చింతగా ఉండాలని సూచించారు.

మిగతా ఆక్రమణలు తొలగించరా..?

గండిపేట గ్రామ ప్రవేశం నుంచి శనివారం కూల్చిన షాపుల వరకు వంద అడుగుల రోడ్డుగా మాస్టర్ ప్లాన్‌లో చూపిస్తుంది. కోకాపేట చౌరస్తా నుంచి గండిపేట సాయిబాబ గుడి వరకు జరగాల్సిన పనులను గండిపేట గ్రామ ప్రవేశం వరకే నిలిపివేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరిగి రోడ్డు ఇరుకుగా మారడంతో గండిపేట పార్కు, గోల్కొండ రిసార్ట్‌కు, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పోయే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి గండిపేట ప్రవేశం నుంచి సాయిబాబ దేవాలయం వరకు వచ్చిన అన్ని ఆక్రమణలను తొలగించి మున్సిపల్ నిధులతోనైనా వంద అడుగుల రోడ్డుగా వెడల్పు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలో పీఆర్‌టీయుటీఎస్ ఎన్నికలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్‌టీయుటీఎస్) ఎన్నికలు శివరాంపల్లి పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, పత్రికా సంపాదకులు కృష్ణారెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు రాజేశ్వర్ రెడ్డి, రాఘువేందర్, హన్మంతులతో పాటు ఎన్నికల పరిశీలకులుగా నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ప్రజలకు డెంగీ, మలేరియాపై అవగాహన


ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి డాక్టర్ రాకేష్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాంతి నగర్ కాలనీలో శనివారం ప్రజలకు డెంగీ, మలేరియా కేసులపై మలేరియా అధికారి డాక్టర్ రాకేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ.. ఇంటి పరిసరాల్లో ఉన్న నీటితొట్లు, పూలకుండీలను పారవేయించి కాలనీల్లోని ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ చెన్న కేశవ్, ఎస్‌యుడీ నారాయణ, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వింగ్, హార్టికల్చర్, శానిటరీ విభాగం సహకారంతో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ పర్యవేక్షణలో క్యాంపస్‌లోని హ్యుమానిటీస్ భవనం పరిసరాలతో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. భవనంపై పేరుకపోయిన వ్యర్థాలు, చెట్ల కొమ్మలు, ఎండిన ఆకులను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటరీ, హార్టికల్చర్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య


షేక్ అబ్దుల్లా గౌస్

అత్తాపూర్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం.. ఎంఎం పహాడి హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్లా గౌస్(22) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. జీవనోపాధిలో భాగంగా కుటుంబ సభ్యులకు చేదోడువాదోడుగా ఉంటూ మార్బుల్స్ పనులు చేస్తుంటాడు. గత మూడు నెలలుగా మానసికంగా బాధపడుతున్నాడు. 'నేను చనిపోతాను' అంటూ పదేపదే అనడంతో పాటు రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడారు. శుక్రవారం రాత్రి భోజనం తర్వాత నిద్ర వస్తుందని గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

చికిత్స పొందుతూ.. కార్మికుడు మృతి


మృతి చెందిన హనుమంత్ గౌడ్

అత్తాపూర్: ఓ భవన నిర్మాణ కార్మికుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గన్‌పూర్ మండలం ముసాపేట్ గ్రామానికి చెందిన హనుమంత్ గౌడ్ (45) భవన నిర్మాణ పనులు చేస్తుంటాడు. అసన్ నగర్ ప్రాంతానికి చెందిన షరీఫ్ పాత ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసేందుకు యూసుఫ్ అనే గుత్తేదారు వద్ద నిర్మాణం కూల్చివేత పనులు చేస్తున్నాడు. ఇంటి నిర్మాణంను కూల్చివేతలో భాగంగా శనివారం ప్రమాదవశాత్తు గాయపడిన హనుమంత్‌గౌడ్‌ను శాలిబండలో ఉన్న ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందిన హనుమంత్ గౌడ్‌ను పోస్టుమార్టం నిమిత్తం ఓజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ

గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ అని, ఏపనినైనా సాధించగలుగుతామన్న ధైర్యం ఎక్కువగా ఉంటుందని మల్టీ జోన్-11 ఐజీ వి.సత్యనారాయణ అన్నారు. గ్రేటర్ పోలీసు హ్యాండిక్యాప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, దివ్యాంగుడైన మహ్మద్ జాహెద్ అలీ శనివారం ఆయనను కలిశారు. వృత్తిరీత్యా ఫ్యాషన్ డిజైనర్ అయిన జాహెద్ అలీ తాను రూపొందించిన పోలీసు లోగోను ఆయనకు అందించారు. పశ్చిమ మండలం డీసీపీగా పనిచేస్తున్నప్పుడు మహ్మద్ జాహెద్ అలీని కలిశానన్నారు. అతడి పని తీరు ఆత్మస్థైర్యం తనకు ఎంతో నచ్చిందని ఆయన అన్నారు. దివ్యాంగులకు జాహెద్ అలీ ఒక స్ఫూర్తి లాంటివాడని పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL DISTRICT AND SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT L.B. NAGAR.
O.S. NO. 1675 OF 2022
Between:
Kasha Prameela ...Plaintiff
And
Jalli Sai kiran & others ...Defendants
To.
Defendant No-1 & 6 to 12, Jalli Sai Kiran, S/o. Jalli Venkatesh,
Aged. Major, R/o. Narsingi Village, Rajendernagar Mandal, R.R. District.
...Defendant No.1
Jalli Srinu S/o Late Jalli Kumarswamy @ Jalli Krishna, Aged. Major, Occ. Real estate.
...Defendant No. 6
Jalli Sanjeeva S/o Late Jalli Kumarswamy @ Jalli Krishna, Aged. Major, Occ. real estate.
...Defendant No. 7
Jalli Ramesh S/o Late Jalli Kumarswamy @ Jalli Krishna, Aged. Major, Occ. real estate.
...Defendant No. 8
Jalli Ravi S/o Late Jalli Kumarswamy @ Jalli Krishna, Aged. Major, Occ. real estate.
...Defendant No. 9
Jalli Gopi @ Jalli Praveen S/o Late Jalli Kumarswamy @ Jalli Krishna, Aged. Major, Occ. real estate.
...Defendant No. 10
Jalli Krishna S/o Late Jalli Shankaraiah, Aged. 74 Yrs.
...Defendant No. 11.
Jalli Jairam S/o Late Jalli Shankaraiah, Aged 64 Yrs.
...Defendant No. 12
Defendant No. 6-12 are residing in, R/o H.No. 4-45, Narsingi Village, Rajendernagar Mandal, R.R District.
Please take notice that the Plaintiff herein has filed the above suit for partition and separate possession and for Consequential mutation in Revenue Records against the Defendants. The above said case is posted to 26.09.2024 at 10.30 am. In the above Court, The said case is posted for your appearance before the said court at 10.30 A.M. If you failed to appear on 26.09.2024 either in person or through your counsel before the said Hon'ble Court, the matter will be decided in your absence.
SCHEDULE OF PROPERTY
All that vacant agricultural land bearing Revenue Survey No.478 (Part) of Manchirevula Village, Gandipet Mandal (formerly) Rajendranagar Mandal, Rangareddy District and bounded as follows North : Land in Survey No.479 to 484, South : Road leading to Gandipet, East : Land in Survey No.477 and Nala, West : Balance Land in Survey No.478 and Neighbour's Land
// By Order Of the Court //
B. AVINASH, Advocate
Flat No-3, Dharani Sai Sharan Shelters, Padmarao Nagar, Secunderabad-500 025, 9985861786

మహిళల భద్రత, ర్యాగింగ్ పై అవగాహన సదస్సు


స్వయ రక్షణలో ఎలా రక్షించుకోవాలో చూపిస్తున్న పోలీసులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కళాశాల విద్యార్థులకు సైబరాబాద్ పోలీస్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళా భద్రత, ర్యాగింగ్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ బృందం విద్యార్థులకు వీడియోలు, పోస్టర్లు, మొబైల్ యాప్ వినియోగం, సైబర్ నేరాలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై సవివరంగా వివరించారు. స్వీయ రక్షణ విన్యాసాలను మహిళా విద్యార్థులకు ప్రదర్శన ద్వారా చూపించారు. యాంటీ ర్యాగింగ్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం జరిగింది. అదేవిధంగా డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళలు ఎలా తమను తాము రక్షించుకోవాలో, ఆపద సమయంలో తాము ఎలా ఎదుర్కోవాలో శిక్షణలో చూపించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ షీటీమ్ బృందం ప్రకాష్‌రావు, బాలరాజ్, సురేష్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ ప్రాథమిక పాఠశాలలో సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు సరిత, స్వాతిలు బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

యువతి అదృశ్యం


శివాని (ఫైల్)

అత్తాపూర్: పక్కింట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లి వస్తానని ఇంట్లో ఉన్న తమ్ముడికి చెప్పి ఓ యువతి కనిపించకుండాపోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నందగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన కావలి అలివేలు, వెంకటేష్ దంపతులకు శివాని(18) శంషాబాద్‌లో ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లిన అనంతరం కళాశాలకి వెళ్లాల్సిన శివాని పక్కింట్లో జరుగుతున్న ఫంక్షన్ చూసి వస్తానని తమ్ముడు శ్రీనాథ్‌కు చెప్పి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులు, ఇళ్లల్లో వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


సామూహిక వినాయక నిమజ్జన ఊరేగింపులతోనే ఐక్యత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కన్వీనర్ బద్దం మహిపాల్ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రమేశ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవ సమితి 1983 నుంచి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హిందూ ఐక్యత కోసం ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలు, సామూహిక నిమజ్జన ఊరేగింపులతో మన ఐక్యత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అంజన్ కుమార్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్, జాయింట్ కన్వీనర్ బి.మహాలింగం, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ సర్కిల్ ఏఎంవోహెచ్‌కు సన్మానం

గోల్కొండ: ఓపెన్ పాయింట్లలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్వాన్ నియోజకవర్గం ఏఎంవోహెచ్ ఇర్షద్ ఇక్బాల్ అన్నారు. నూతన ఏఎంవోహెచ్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఈర్షద్ ఇక్బాల్‌ను శనివారం హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ కార్వాన్ సర్కిల్ ఇన్‌చార్జి మురళీచక్రవర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇర్షద్ ఇక్బాల్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోకుండా చూడాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు హెచ్ఐఎంహెచ్‌డబ్ల్యూ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సూపర్‌వైజర్లు తోకటి వినోద్‌కుమార్, శ్రీనివాస్, ఉమేష్, శ్రావణ్, యాదగిరి, ముజీబ్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం


యూసఫ్ ఖాన్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన యూసఫ్ ఖాన్ (44) లేబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మొగల్స్ కాలనీలో..


సత్తయ్య (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్స్ కాలనీకి చెందిన కాశమ్మ, సత్తయ్య భార్య భర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తమ సొంత ఊరు మహబూబ్‌నగర్ నుంచి కొన్ని రోజుల క్రితం మొగల్స్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లిన సత్తయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ బంధువులను, స్నేహితులను విచారించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా హనుమాన్ పారాయణం

రాజేంద్రనగర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శనివారం రాత్రి హనుమాన్ పారాయణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హనుమాన్ పారాయణాన్ని సామూహికంగా పఠించి అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.


హనుమాన్ పారాయణం చేస్తున్న భక్తులు

పాఠశాలల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


కృష్ణుని వేషధారణల్లో చిన్నారులు



రాజేంద్రనగర్: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సర్కిల్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన కృష్ణ వేషధారణ పోటీల్లో విద్యార్థులు పోటీగా పాల్గొన్నారు. తమ తల్లిదండ్రులు చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలో అందంగా ముస్తాబు చేసి పాఠశాలలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాజేంద్రనగర్, హైదర్‌గూడలోని పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.9.13 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం పలు అభివృద్ధి పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. కిస్మత్‌పూర్, దర్గా, అభ్యుదయానగర్, పిఅండ్‌టి కాలనీ, ద్వారకానగర్, మల్లికార్జున కాలనీ, చండిక నగర్ కాలనీలలో కమ్యూనిటీహాల్స్ నిర్మాణానికి, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి, యూజీడీ, సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కరోజే 9.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ బచ్చల కూర శరత్‌చంద్ర, మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్లు శ్రీలత సురేష్‌గౌడ్, భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు

పశు సాంకేతిక సదస్సు


సదస్సులో నూతన లోగోలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో శనివారం 10వ రాష్ట్రస్థాయి పశు సాంకేతిక సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ సభ్యసాచి ఘోష్ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సాంకేతిక సదస్సులో పరిశోధనలకు కావల్సిన అన్ని రకాల వసతులను కల్పిస్తామని పరిశోధన మాలిక్యులర్ లెవెల్‌లో చేయ్యాలని, యనిమల్ హెల్త్ లాబ్ ఏర్పాటు చేయడానికి వినతి పత్రాలను ఇవ్వాలని తెలిపారు. తన ఆధ్వర్యంలో పశు వైద్య విశ్వవిద్యాలయంను దేశంలోనే అత్యుత్తమైనదిగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ నుంచే పరిశోధనలో భాగస్వాములను చేయ్యాలని సూచించారు. 2024-2025 సంవత్సరానికి 6 కోట్ల విలువైన పరిశోధన పథకాలను ఫండింగ్ ఏజెన్సీస్‌కి విన్నవించారని తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సిబ్బంది పరిశోధన ఆప్టిట్యూట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధఖశాఖ సంచాలకులు బి.గోపి, ఆర్‌కెవివై ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ రాజన్న, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ, కె విజయ్, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జ్ఞానప్రకాష్, ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సభ్యులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సభ్యులు శనివారం కార్పొరేటర్ సాగర్‌గౌడ్, కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నూతన కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షులు తాండ్ర రమేష్‌కుమార్, గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షులు ఈదలకంటివ యాదయ్యల ఆధ్వర్యంలో సంఘం సభ్యులు భవన నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కోరారు. అందుకు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె.నరేష్, మల్లేష్, విజయ్, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మణ్, కె.సత్యనారాయణ, ఎస్.విట్టలయ్య, ఎం.జగదీశ్వర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్‌పై నిర్మాణాల కూల్చివేత


హోటళ్లు, దుకాణాల షెడ్లు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో మురుగు నీటి ప్రవాహానికి చెందిన మ్యాన్‌హోల్‌పై రేకులతో షెడ్లుగా నిర్మాణం చేసిన హోటళ్లు ఇతర దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. సుమారు ఏడు సంవత్సరాల కిందటే నిర్మాణం చేసిన వాటిని పారిశుద్ధ్య విభాగం అధికారులు పోలీసుల సమక్షంలో తొలగించారు. హోటళ్లకు సంబంధించిన వ్యక్తులు వ్యర్థాలను తీసుకొచ్చి సమీపంలోని ఫ్లైఓవర్ కిందవేయడంతో ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన అధికారులు మున్సిపాలిటీ నిర్మాణం చేసిన మ్యాన్‌హోళ్లు మొత్తం దుకాణాల కారణంగా మూసుకుపోయినట్లు గుర్తించారు. మున్సిపాలిటీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలోని బృందం మ్యాన్‌హోళ్లపై భాగంలో సర్వీసు రహదారిని ఆనుకుని అక్రమంగా ఉన్న ఆరు నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. దీంతో ఇక్కడ రహదారి కూడా వెడల్పుగా సౌకర్యవంతంగా మారింది.

పార్కు పనులను పరిశీలించిన కార్పొరేటర్


పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో 30లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పార్కు ప్రహరి గోడ నిర్మాణ పనులను శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మధుబన్‌కాలనీలో పార్కు పనులను ప్రారంభించానని, కాలనీలో ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు అందిస్తానని తెలిపారు. కాలనీలో మెరుగైన రోడ్లు వేయడానికి ఎస్టిమేషన్ వేయిస్తున్నట్లు స్థానికులకు తెలిపారు. త్వరలో కాలనీలోని అన్ని రోడ్లు మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భాను, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డివి కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230